సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం ၊ 20 ၊ మార్చి ၊ 2023



మల్లన్నకు బోనం

కథలాపూర్: మండలం ఊట్‌పల్లిలో ఆదివారం మల్లికార్జునస్వామి జాతర వైభవంగా జరిగింది. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చారు.



బోనమో పోచమ్మ

గొల్లపల్లి : లొత్తునూర్‌లో మహిళలు ఆదివారం బోనాల ఊరేగింపు నిర్వహించారు. పోచమ్మకు నైవేద్యం సమర్పించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
28.0/19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు ప్రతిభాపాటవ పరీక్ష



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకులు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈనెల 21న ప్రతిభాపాటవ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్లలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ప్రతీ ప్రాథమిక పాఠశాల నుంచి ప్రతిభ కనబరిచే ఇద్దరు విద్యార్థులను పంపించాలని కోరారు. తెలుగు, ఆంగ్లం, గణితం, ఈవీఎస్ విభాగాలలో ప్రతీ విభాగం నుంచి 15 ప్రశ్నల చొప్పున మొత్తం 60 ప్రశ్నలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రమానాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు డి.హన్మంతరెడ్డి, మల్లారపు పురుషోత్తం, విక్కుర్తి అంజయ్య, కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీధర్, దబ్బెడ హన్మాండ్లు పాల్గొన్నారు.

రామన్నపేటలో కూలిన ఇల్లు



దెబ్బతిన్న ఇంటి పైకప్పు

చందుర్తి(వేములవాడ): మండలంలోని రామన్నపేటకు చెందిన నాయిని లక్ష్మికి చెందిన ఇల్లు శనివారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. సుమారు రెండు గంటలకు పైగా భారీ వర్షం కురవడంతో ఇంటి పైకప్పు పాక్షికంగా దెబ్బతింది.

లెక్చరర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ పట్టాను అందిస్తున్న గవర్నర్..

వేములవాడ అర్బన్: వేములవాడ మండలం అగ్రహారంలోని ఎస్సారార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగం అధ్యాపకురాలు హిమజకు జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. గవర్నర్ తమిళిసై చేతులమీదుగా అందుకున్నారు. హిమజను కాలేజీ ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్, అధ్యాపకులు అభినందించారు.

'మంత్రి కేటీఆర్ బాధ్యత వహించాలి'

చందుర్తి(వేములవాడ): టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీకి రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ నైతిక బాధ్యత వహించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ డిమాండ్ చేశారు. చందుర్తిలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పారదర్శకమైన ప్రభుత్వం ఉందన్నారు. పేపర్ లీకేజీలతో నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి బాధ్యులను శిక్షించాలని కోరారు. మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, నాయకులు ఉన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల అర్బన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ రైతుసంఘం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని కార్మికులు, కర్షకులు అన్ని రంగాల కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రైతు సంఘం నాయకులు రామంచ అశోక్, గన్నేరం నర్సయ్య, బాబు, సూరం పద్మ, మోర అజయ్, తదితరులు ఉన్నారు.

ఆశలపై రాళ్లు



● ఇతని పేరు సింగిరెడ్డి మల్లారెడ్డి. తంగళ్లపల్లి మండలం వేణుగోపాల్‌పూర్‌కు చెందిన మల్లారెడ్డి యాసంగిలో మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశారు. ఆ పంట ఇప్పుడు కంకిపాలు పోసుకునే దశలో ఉంది. మరో 20 రోజులు పంట చేతికి అందుతుందని భావిస్తుండగా.. శనివారం రాత్రి కురిసిన రాళ్లవానతో మొక్కజొన్న పంట పాడయింది. చేను విరిగిపోయి నేల వాలింది. మల్లారెడ్డికి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు నష్టం జరిగింది.



చీర్లవంచలో రాలిన మామిడికాయలు



ఇది తంగళ్లపల్లి మండలం పాపయ్యపల్లెలో పెంకాసుల నరేశ్‌కు చెందిన మామిడి తోటలోని రాలిన మామిడికాయలు. ఏడాది పొడవున మామిడితోటపై ఆశలు పెట్టుకుని కంటికి రెప్పలా కాపాడుకుంటే శనివారం కురిసిన వడగండ్ల వానకు మామిడికాయలు నేలకూలాయి. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన రాజయ్య తన రెండెకరాలలో తోట దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలా జిల్లాలోని రుద్రంగి, వేములవాడరూరల్, చందుర్తి, బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లో రైతులు యాసంగిలో సాగుచేసిన పంటలు దెబ్బతిన్నాయి. మామిడికాయలు రాలిపోయాయి.



● ఇతని పేరు ఈర్నం విజయ్. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన విజయ్ ఆరు ఎకరాల్లో వరి పంటను సాగుచేశాడు. పొలం సగం ఈనింది. పొట్ట దశలో ఉంది. శనివారం రాత్రి కురిసిన వర్షంతో వరిగొలకలపై రాళ్లు పడడంతో పాలు కారిపోయాయి. గొలకలు విరిగిపోయాయి. మరో ఎకరంలో పూవు దశలో ఉన్న నువ్వు పంట నేలమట్టమైంది.

నివేదిక ఇవ్వండి



"జిల్లాలో రాళ్ల వానతో జరిగిన పంట నష్టంపై నివేదిక ఇవ్వాలని వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖలను ఆదేశించాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి వడగళ్ల వానతో జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని సూచించాం. పూర్తి సమాచారంతో రైతుల వారీగా గ్రామాలు, మండలాల వారీగా నివేదిక అందించాలి. నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది."

– అనురాగ్ జయంతి, కలెక్టర్

- వడగండ్లతో అన్నదాతలకు కన్నీళ్లు
- అకాల వర్షంతో అపార నష్టం
- నివేదిక కోరిన మంత్రి కేటీఆర్
- పంట నష్టాలపై నివేదిక ఇవ్వండి : కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో వడగండ్ల వర్షం అన్నదాతలను నిండా ముంచింది. ప్రకృతి ప్రకోపానికి జిల్లాలోని పంటలు నేలమట్టమయ్యాయి. ఆరుగాలం శ్రమించిన రైతులు పంటల దిగుబడిపైనే ఆశలు పెట్టుకున్నారు. పంట మరో పక్షం నుంచి నెల రోజుల్లో చేతికి అందుతుందనే ఆశలో ఇలా రాళ్లవానతో నష్టం జరగడం ఆందోళన కలిగిస్తుంది. జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో 1,79,625 ఎకరాల్లో అన్ని పంటలు సాగయ్యాయి. ఒక్క వరి పంటనే 1,73,600 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న, నువ్వులు, పెసర పంటలు కలిపి 6,025 ఎకరాల్లో సాగుచేశారు. గతేడాది కంటే ఈసారి వరి సాగు విస్తీర్ణం పెరిగింది. కానీ రాళ్లవానలతో రైతులు నిరాశకు గురవుతున్నారు.



ఇతను రుద్రంగికి చెందిన గోనె కృష్ణారావు. నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. పంట మొత్తం ఈని, పాలు పట్టింది. మరో 25 రోజులు గడిస్తే పంట చేతికొచ్చేది. కరెంట్ కోతలు, నీటి కొరతతో ఇబ్బందులు పడి యాసంగి పంటను గట్టెక్కించుకున్నానని భావిస్తుండగా.. శనివారం కురిసిన రాళ్లవానతో కృష్ణారావు ఆశలు ఆవిరయ్యాయి. పంట గింజ పడుతుంతో లేదోనని రైతు ఆందోళన చెందుతున్నాడు.

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు

జిల్లాలోని అన్ని మండలాల్లోనూ వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో రాళ్లవాన పడగా.. మరికొన్ని మండలాల్లో వర్షం మాత్రమే కురిసింది. జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలో అత్యధికంగా 58.5 మిల్లీమీటర్లు, అత్యల్పంగా వీర్నపల్లి మండలంలో 9.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రుద్రంగిలో 30.9, చందుర్తిలో 19.6, వేములవాడ రూరల్‌లో 10.3, బోయినపల్లిలో 32.0, వేములవాడలో 16.4, సిరిసిల్లలో 25.4, కోనరావుపేటలో 23.2, ఎల్లారెడ్డిపేటలో 50.5, ముస్తాబాద్‌లో 26.1, గంభీరావుపేటలో 26.6, ఇల్లంతకుంటలో 36.7 మిల్లీమీటర్ల వర్షం నమోదైనట్లు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పీ.బీ.శ్రీనివాసచార్యులు ఆదివారం తెలిపారు. జిల్లాలో సగటు వర్షపాతం 28.1 మిల్లీమీటర్లు ఉందన్నారు.

ఐదెకరాల్లో పంట నష్టం



ఐదెకరాల్లో వరి వేశాను. పొలం పొట్టదశలో ఉంది. మరో నెలరోజులు అయితే.. పంట చేతికి వస్తుంది. శనివారం కురిసిన రాళ్లవానతో వరి గొలకలు విరిగిపోయాయి. పొలం కోలుకోకుండా దెబ్బతిన్నది. పంటకోసం పెట్టుబడిగా రూ.లక్ష పెట్టాను. పంట నష్టం రూ.3 లక్షలు ఉంటుంది. ప్రభుత్వం ఆదుకోవాలి. – వంగపల్లి రాజయ్య, సారంపల్లి

ముస్తాబాద్‌లో 3.07 సెంటిమీటర్ల వర్షం

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. మండలంలో 3.07 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ మునీందర్ తెలిపారు. నామాపూర్‌లో బొప్పాయి పంట, మామిడితోటలు దెబ్బతిన్నాయి. బాధిత రైతులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిరుద్యోగుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే

- ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలివేనా?
- ఉద్యోగ నియామకాలపై శ్వేతపత్రం ఇవ్వండి
- వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వై.ఎస్.శర్మిల



నవీన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్. షర్మిల

సిరిసిల్లటౌన్: నిరుద్యోగుల ఆత్మహత్యలన్నీ.. ప్రభుత్వ హత్యలేనని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వై.ఎస్.శర్మిల పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం సిరిసిల్లలో ఆత్మహత్యకు పాల్పడిని చిటికెన నవీన్ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రెండు లక్షల వరకు ఉద్యోగాలిచ్చామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో 2 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని బిస్వాల్ కమిటీ నివేదిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 26 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇచ్చి 8 వేల ఖాళీల భర్తీకి పరీక్షలు నిర్వహించి చేతులు దులుపుకుందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేవు కానీ.. కేసీఆర్ కుటుంబంలో నలుగురికి ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రటరీలకు మాత్రమే తెలియాల్సిన పాస్‌వర్డులు అందరికీ ఎలా తెలిశాయని ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. కొత్త మండలాలు. జిల్లాలకు సరిపడా 3.80 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లలో దరఖాస్తులు చేసుకున్న యువతకు రుణాలు మంజూరు చేయాలని కోరారు.

మీ బాధలో పాలు పంచుకోవడానికే వచ్చా

సిరిసిల్ల బీవైనగర్‌లోని నవీన్ ఇంటికొచ్చిన వై.ఎస్.శర్మిల మృతుడి కుటుంబ సభ్యులతో రాజకీయాలకు అతీతంగా మాట్లాడారు. సంఘటన పూర్వాపరాలు తెలుసుకుని నవీన్ తల్లిదండ్రులను ఓదార్చుతూ మాట్లాడారు. రెండు రోజులుగా నవీన్ మరణంపై రాజకీయం చేస్తున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేయగా..తాను బాధలో ఉన్న మిమ్మల్ని కలవడానికే వచ్చానంటూ ఓదార్చారు. అనంతరం వైఎస్సార్‌టీపీ పట్టణాధ్యక్షుడు మ్యాన లక్ష్మీనారాయణ తండ్రి ఇటీవల మృతిచెందగా.. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్, కరీంనగర్ అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్, పార్లమెంటర్ కోఆర్డినేటర్ కంది వెంకటరమణారెడ్డి, అనిల్ పాల్గొన్నారు.



రాజన్నకు కోడెమొక్కులు

వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు తరలివచ్చారు. కల్యాణకట్టలో తలనీలాలు, ధర్మగుండంలో స్నానాలు చేసిన అనంతరం కోడెమొక్కులు చెల్లించుకున్నారు. బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు



తలనీలాలు సమర్పించుకుంటున్న భక్తులు

రైతన్నలు అధైర్యపడొద్దు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



పంట నష్టాన్ని పరిశీలిస్తున్న తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అకాల వర్షానికి నష్టపోయిన రైతన్నలు అధైర్య పడొద్దని అండగా ఉంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటతోపాటు సర్వాయిపల్లి, రాచర్లబొప్పాపూర్, కోరుట్లపేట గ్రామాల్లో ఏర్పడిన పంటనష్టాన్ని జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. రాళ్లవానకు ధ్వంసమైన కోళ్లఫామ్స్ షెడ్లను, మామిడితోటలను పరిశీలించారు. పంటనష్టంపై నివేదికను ప్రభుత్వానికి అధికారులు అందజేస్తారని తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి రణధీర్, తహసీల్దార్ జయంత్ కుమార్, ఏవో భూంరెడ్డి, ఎల్లారెడ్డిపేట సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొం రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీమ్

- ఎస్పీ అఖిల్ మహాజన్



జిల్లాకు కొత్తగా ఏర్పాటు చేసిన డీఆర్‌ఎఫ్ టీం

సిరిసిల్లక్రైం: వరదలు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, భవనాలు కూలిపోవడం, ప్రాణాలను రక్షించడం వంటి విపత్తు సంభవించిన పరిస్థితుల్లో పోలీసులు మరింత సమర్థంగా విధులు నిర్వహించేందుకు జిల్లాలో డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. 12 మందితో కూడిన విపత్తు ప్రతిస్పందన దళాన్ని(డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్)టీమ్‌ను ఆదివారం కలిసి మాట్లాడారు. ఈ బృందానికి పది రోజులపాటు హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉన్న డీఆర్‌ఎఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణనిచ్చినట్లు తెలిపారు. జిల్లాలో వరదలు, ఇతర వైపరీత్యాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి, సహాయం చేసేందుకు ఇద్దరు ఆర్ఎస్సైల తోపాటు 10 మంది కానిస్టేబుళ్లతో ఈ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

22 నుంచి శ్రీరామ నవరాత్రోత్సవాలు

- 30న సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవం

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు శ్రీరామ నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 30న 11.59 గంటలకు సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 22న పంచాంగ పూజ, సాయంత్రం 4 గంటలకు పంచాంగశ్రవణం, రాత్రి 8 గంటలకు పెద్దసేవలపై స్వామి వారి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 28 నుంచి 30 వరకు భక్తోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 30న స్వామి కల్యాణోత్సవం అనంతరం పూర్ణాహుతి, రథోత్సవం, డోలోత్సవం నిర్వహిస్తామని వివరించారు.

పేపర్ లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోండి



అంబేద్కర్‌చౌక్‌లో కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్
- కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మల దహనం

వేములవాడ: పేపర్‌ను లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్‌చౌక్‌లో ఆదివారం కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులతో ఆటలాడుకుంటుందన్నారు. సాగారం వెంకటస్వామి, చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, నాగుల విష్ణు, పాత సత్యలక్ష్మి, తూము మధు, నాగుల రాము, మెండె రాజు, వస్తాద్ కృష్ణ, తోట లహరి, గంటల ప్రకాశ్, శ్రీకాంత్, బొజ్జ భారతి, గడ్డం రేణుక, ఎర్రం ఆగయ్య, నాగుల మహేశ్, నక్క సాయి, పల్లపు రాజేందర్, దండుగుల తిరుపతి, ఎస్‌కే సాబీర్ పాల్గొన్నారు.

నేతన్నల పొట్ట తిప్పలు

- వివిధ జిల్లాల నుంచి ఉపాధికోసం సిరిసిల్లకు
- నెలంతా కష్టపడినా.. ఖర్చులకే పరిమితం
- అయినవాళ్లకు దూరంగా శ్రమజీవులు



ఇతని పేరు దాసరి కుమారస్వామి. తొమ్మిదేళ్ల కింద హుజురాబాద్ నుంచి వచ్చి టీస్టాల్ పెట్టుకున్నాడు. దీనికి తోడు ఇరవైమంది కార్మికులకు భోజనం వండి పెడుతున్నాడు. ఒక్కో కార్మికుడు ప్రతివారం రూ. 500 నుంచి 550 వరకు ఇస్తారు. 18 గంటలకు పైగా కష్టపడినా ఇల్లు, టీస్టాల్ రెండూ అద్దెవి కావడంతో ఖర్చులకే సరిపోతుందని వాపోతున్నాడు.



భోజనం చేస్తున్న వలస కార్మికులు



ఇతని పేరు వెల్ది సత్యనారాయణ. కోహెడ మండలం.. తంగళ్లపల్లి స్వగ్రామానికి చెందిన ఇతనికి ముగ్గురు కూతుళ్లు. అప్పులు చేసి ఇద్దరికి వివాహాలు చేశాడు. అప్పు తీర్చేందుకు కుటుంబమంతా కష్టాన్నే నమ్ముకుంది. సొంతూరులో భార్య కూలీ పనులు చేస్తోంది. ఇతను సిరిసిల్లకు వలస వచ్చి నేత కార్మికుడిగా స్థిరపడ్డాడు. నెలంతా శ్రమపడితే వచ్చే ఆదాయంలోంచి నాలుగు వేల వరకు పోగుచేసి ఇంటికి పంపిస్తుంటాడు.

సిరిసిల్లకల్చరల్ : దశబ్దాలుగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ వలస కార్మికులకు ఉపాధినిచ్చే కేంద్రంగా మారింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వందలాది మంది నేత కార్మికులు వలసవచ్చి ఉపాధి పొందుతున్నారు. ఉండడానికి ఆవాసం లేక ఇబ్బందులు పడుతునన్నారు. భార్యా పిల్లలకు దూరంగా ఉంటూ చేనేత కార్మికులుగా పనులు చేసుకుంటున్నారు. పనిచేసే చోట కలిసిన ఇతర కార్మికులనే స్నేహితులుగా మలుచుకుంటూ కాలం గడుపుతునన్నారు. కార్ఖానాలో పని, భోజనం, నిద్ర ఒక్కో అవసరానికి ఒక్కో చోటు వెదుక్కోవాల్సిందే. వీరినే ఆధారం చేసుకుని వలస కార్మికులకు ఆహారం వండిపెడుతూ ఉపాధి పొందుతున్న వారు కొందరైతే, రాత్రిపూట నిద్ర, విశ్రాంతి తీసుకునేందుకు ఆశ్రయం కల్పిస్తున్న వారు మరికొందరు. రాత్రి డ్యూటీ చేసే వాళ్ల కోసం అర్ధరాత్రి పూట టీహోటళ్ల నడుపుతూ కొంతమంది ఉపాధి పొందుతున్నారు.

మరో భీవండిగా మారిన సిరిసిల్ల

దశాబ్దాలుగా సిరిసిల్ల వస్త్రోత్పత్తికి మారుపేరుగా నిలుస్తోంది. మహారాష్ట్రలోని భీవండి, షోలాపూర్‌లా, వలస కార్మికులకు ఉపాధినిస్తోంది. మెట్ట ప్రాంతమైన సిరిసిల్ల నుంచి చాలామంది పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లేది. రాష్ట్రం ఆవిర్భవించాక సిరిసిల్లకు ప్రభుత్వపరమైన ఆర్డర్లు రావడంతో కార్మికులకు పని దొరుకుతోంది. వందలాది కార్మికులకు రాత్రయితే పడుకునేందుకు ఆశ్రయం ఉండదు. నెలకు రూ.400 తీసుకుని కొందరు వీరికి పడుకునేందుకు ఆశ్రయం కల్పిస్తున్నారు. రోజూ రెండు పూటలా భోజనం కోసం వంట చేసి పెట్టేవాళ్లను ఆశ్రయిస్తున్నారు. కార్మిక ప్రాంతాలైన సుభాష్‌నగర్, నెహ్రూనగర్, బీవైనగర్, సుందరయ్య నగర్, గణేశ్‌నగర్, వెంకంపేట, రాజీవ్‌నగర్, ముష్టిపెల్లి, తదితర ప్రాంతాల్లో ఈ తరహా ఆశ్రయ, ఆహార కేంద్రాలు నడుస్తున్నాయి. వలస కార్మికులకు ప్రభుత్వపరమైన ఆశ్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. అభిప్రాయం.

ఐదేళ్లుగా ఇక్కడే సాంచెలు నడుపుతున్నా..



మాది జగిత్యాల జిల్లా నర్సింహులపల్లె. సుమారు నలభై ఏళ్లవరకు పైగా భీవండిలో సాంచెలు నడిపే పని చేసిన. వయసు పెరగడం, ఆరోగ్యం సహకరించకపోవడంతో సిరిసిల్లకు వచ్చిన. ఐదేళ్లుగా ఇక్కడే సాంచెల పనిచేస్తున్న. పొట్టకు తినుడు చిన్నప్పటి నుంచి అలవాటైంది. రాత్రిపూట ఇంకో చోట పడుకుంటాను.

– ద్యావనపెల్లి సత్తయ్య, నేత కార్మికుడు

నేత పనిలో బర్కత్ ఉంటలేదు



1970 నుంచి భీవండిలో నేత కార్మికుడిగా పనిచేసేందుకు వెళ్లాను. అప్పటినుంచి ఇదే పని.ఇపుడు నాకు అరవై ఏళ్లు. ఏడేళ్ల కింద సిరిసిల్లకు వచ్చి సాంచెలు నడుపుతున్నాను. పనిచేసుకుంటూ లక్ష రూపాయల అప్పు కట్టేందుకు తిప్పలు పడుతున్న. ఇంటికి నెలకు రెండువేలు పంపిస్తున్నాడు. నేత కార్మిక పనిలో బర్కత్ ఉంటలేదు.

–గుర్రం మల్లేశం, అరవెల్లి గ్రామం.

మాటవోతే మంచిగుండదని



నా చిన్నతనంలో తండ్రి కష్టం చేయకపోవడంతో తల్లి నన్ను భీవండికి తీసుకెళ్లింది. ఇపుడు అరవై ఏళ్ల వయసు మీదపడడంతో కొన్నేళ్ల క్రితం ఇక్కడికి వచ్చాను. రెక్కలు ముక్కలు చేసుకున్నా మిగిలేది కొంతే. అప్పులు తీరుత లేవు. అయినా అప్పు తెచ్చుకున్న కాడ మాటవోతే బాగుండదని కష్టపడుతూ బతుకు ఎల్లదీస్తున్నా.

–ఎలిగేటి వెంకటరమణ , అరవెల్లి గ్రామం, పెగడపల్లి మండలం

ఇరవై ఏళ్లు భీవండిలో పనిచేసిన



ఇరవై ఏళ్లపాటు భీవండిలో పనిచేసిన. ఐదేండ్లాయె సిరిసిల్లకు వచ్చి సాంచెలు నడుపుతున్నా. నాకు కొడుకు, ఇద్దరు కుమారులు. వారానికి మూడు నాలుగు వేలు వస్తయి. రోజువారీ ఖర్చులు పోను మిగిలేది కొంతే. ఎల్లినకాడికి ఇంటికి పంపుతుంటాను.

–జోగు ఓదెలు, కమలాపూర్

క్లుప్తంగా

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలు దహనం



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండల కేంద్రంలో ఆదివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ (టోని) ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి మంత్రి కేటీఆర్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. అంతక ముందు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నేరెళ్ల నర్సింగం గౌడ్, మునిగెల రాజు, చుక్క రాజశేఖర్, కొత్త రవి గౌడ్, పాన్నాల పరుశరాములు, బాలసాని శ్రీనివాస్, అరెపల్లి బాలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ



ప్యాడ్స్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ హైస్కూల్‌కు చెందిన 1996–97 పదోతరగతి విద్యార్థులు మండలంలోని అల్మాస్‌పూర్‌లోని పదోతరగతి విద్యార్థులకు పరీక్షప్యాడ్స్ అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి జీపీఏ తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఉన్న సమయాన్ని ప్రణాళికతో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నీరటి రాజు, భట్టారి సంపత్‌కుమార్, చింతల అంజయ్య, ముత్యాల సత్యనారాయణ, శ్రీరా మోజు దేవరాజు, ఎగదండి రామకృష్ణ, చీకోటి మహేందర్,కామిరెశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

కోనరావుపేట: మండలంలోని ధర్మారం ప్రాథమిక పాఠశాలలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఎస్‌ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సామగ్రి, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు 2022–23 విద్యాసంవత్సరానికిగాను రూ.30 వేలు మంజూరయ్యాయి. ఎస్‌ఎంసీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు జాయింట్ చెక్ పవర్ ఉండడంతో డబ్బులు డ్రా చేశారు. డబ్బులను తీసుకున్న ప్రధానోపాధ్యాయురాలు సామగ్రి వివరాలను తెలుపకపోవడంతో పాఠశాల స్థాయి సమావేశంలో ఎస్‌ఎంసీ చైర్మన్, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. పలు సమావేశాల్లో ఇదే విషయంలో వాగ్వాదం జరుగుతుండడంతో ఎంఈవో, డీఈవోకు సైతం ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఎంఈవో దూస రఘుపతిని వివరణ కోరగా ఇప్పటివరకు లిఖితపూర్వకమైన ఫిర్యాదు రాలేదని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్ స్పందించకపోతే భవిష్యత్‌లో విద్యార్థుల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవడం ఖాయమన్నారు. మారుమూల ప్రాంత విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కళాశాల ఏర్పాటుకు కృషిచేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ నాగరాజు, ఆదిత్య అరవింద్, రాకేశ్, సిద్ధు, నిఖిల్, శివ రాజేందర్, అజయ్, నరేశ్, అరుణ్, భరత్, వంశీ, ప్రవీణ్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి



కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

సిరిసిల్ల టౌన్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలపై ఆదివారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యంతోనే విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. ఇక్కడ డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ గౌడ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల పట్టాలిచ్చేవరకు పోరాటం ఆగదు



మాట్లాడుతున్న కుమారస్వామి

గోదావరిఖని(రామగుండం): పోలీసులు రాత్రి పూట జెండాలు తీసేసినంత మాత్రాన భూపోరాటం ఆగదని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల కుమారస్వామి అన్నారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూపోరాటం ఆదివారం రెండోరోజుకు చేరింది. వందలాది మంది నిరుపేదలు గుడిసెలు వేసుకోవడానికి చెట్లు కొట్టి, జెండాలు పాతారన్నారు. పోలీసులు రాత్రిపూట వచ్చి, వాటిని తొలగించారని తెలిపారు. కబ్జాదారుల నుంచి భూములను కాపాడాల్సిన వారు ఆ పని చేయకుండా పేదలు వేసుకున్న జెండాలు తీసివేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వానికి చేతనైతే కబ్జాదారుల నుంచి ప్రభుత్వ స్థలాలు కాపాడాలన్నారు. నిరుపేదలకు ఇళ్లస్థలాల పట్టాలిచ్చేవరకు తమ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎ.మహేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు మెండె శ్రీనివాస్, లావణ్య, నాయకులు పైముద, పీర్ మహమ్మద్, నాగమణి, లలిత, ఓదెలు, గోపాల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు చేయాలి

- బీజేపీ యూఏఈ కో–కన్వీనర్ పెనుకుల అశోక్



ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అశోక్, నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు చేయాలని బీజేపీ యూఏఈ కో–కన్వీనర్ పెనుకుల అశోక్ కోరారు. ఆదివారం దుబాయిలో బీజేపీ యూఏఈ శాఖ ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా గ్రా మీణ ప్రాంతాల్లోని యువత ఉపాధి కోసం ఏడారి దేశాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అమాయక కార్మికులు నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోతున్నారని, గల్ఫ్ దేశాలకు వలస వచ్చి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి గల్ఫ్ బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వాలు అండగా నిలవాలని పేర్కొన్నారు. వలసజీవుల వెతలు తీరాలంటే కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఐ పాలసీని ప్రకటించాలన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే గల్ఫ్ కార్మికుల విన్నపాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఎన్‌ఆర్‌ఐ పాలసీపై ప్రభుత్వం ప్రకటన చేయాలని అసెంబ్లీలో లేవనెత్తుతాని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో యూఏ ఈ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేతకాని మహర్‌లు అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): నేతకాని మహర్ ప్రజల హక్కుల రక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని నేత కాని మహర్ కుల హక్కుల పరిరక్షణ సంఘం జాతీ య అధ్యక్షుడు గోమాస శ్రీనివాస్ అన్నారు. ఆదివా రం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేతకాని మహర్ సామాజికవర్గానికి చెందినవారు రాష్ట్రంలో 15 లక్షల మందికి పైగా ఉన్నారని తెలిపా రు. వీరందరూ రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఆర్థికపరంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం పలు అంశాలపై తీర్మానం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్‌తోపాటు నాలుగు అసెంబ్లీ స్థానాలు నేతకాని మహర్ సామాజికవర్గానికి కేటాయించాలని కోరా రు. అటవీ ప్రాంతంలో నివసిస్తున్న నేతకాని గిరిజనేతరులకు పోడు భూములకు భూయాజమాన్య హ క్కు పత్రాలు ఇచ్చి, క్రయవిక్రయాలు చేసుకునేందు కు అవకాశం ఇవ్వాలన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసి, అసైన్డ్, పోరంబోకు, ఇనాం భూములు కలిగిన ఎస్సీలందరికీ భూయాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి భూ నిర్వాసితులకు కనీస వసతులతోపాటు ఇంటికో ఉద్యోగం కల్పించాలన్నారు. నాయకులు జవ్వాజి తిరుపతి, దుర్గం ఎల్లయ్య, రత్నం ప్రదీప్, నాగరాజు, అంతర్గాం రాజమౌళి, ఇప్పుల గంగారం , హెచ్‌ఎంఎస్ నాయకులు రియాజ్ అహ్మద్ తదితరులున్నారు.

శ్రీ లక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్



జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ-రాఘవరెడ్డి దంపతులకు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకుడు

సిరిసిల్ల : జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీనర్సింహ స్వామిని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ–రాఘవరెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలను కప్పి, స్వామివారి ప్రసాదం అందజేశారు. వారివెంట స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ధర్మపురి : ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపువద్ద శనివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు అతివేగంతో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో తపత్ మహేందర్, కాస సర్సయ్యకు తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బందికి సమాచారం అందించగా చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి ..



గాయపడిన శంకరయ్య

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో తాటిచెట్టుపై నుంచి పడి రంగు శంకరయ్య అనే గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శంకరయ్య రోజూ మాదిరిగానే కల్లు గీసేందుకు ఆదివారం తాటి చెట్టుపైకి ఎక్కుతున్న క్రమంలో మోకజారి కిందపడిపోయాడు. దీనితో శంకరయ్యకు తీవ్ర గాయాలుకాగా జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టేకు కలప పట్టివేత

మేడిపెల్లి: బీమారం మండలం.. మన్నెగూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను అటవీశాఖ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. రూ.5 లక్షల విలువగల టేకు కలపను పట్టుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ ఎఫ్‌ఆర్వో రవికుమార్, బీట్ ఆఫీసర్ ప్రదీప్ పాల్గొన్నారు.

నేటినుంచి ఇసుక రీచ్ ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్



మల్లారంలోని మూలవాగు

వేములవాడ రూరల్: వేములవాడ మండలంలోని మూలవాగు నుంచి అధికారికంగా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. ఈనెల 15న 'ఇసుక కొరత.. నిర్మాణాల నిలిపివేత' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా యంత్రాంగం అధికారికంగా ఇసుక రీచ్ ఏర్పాటు చేసేందుకు మండల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. వేములవాడ తహసీల్దార్ నక్క శ్రీనివాస్ మల్లారం గ్రామ శివారులో ఇసుక రీచ్ ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసినట్లు సమాచారం. కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వ్యాపారులపై వరుస కథనాలు రావడంతో పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు అక్రమ తరలింపుకు అడ్డుకట్ట వేశారు. దీంతో జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టిసారించి ప్రభుత్వ పనులకు నిబంధనల ప్రకారం అనుమతులు ఇచ్చేందుకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది.

భూ వివాదమే ప్రాణాలు తీసింది



రోదిస్తున్న మృతుడి భార్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఓ రైతు తన పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేసే విషయంలో తల్లిదండ్రులు అంగీకరించడం లేదని మనస్తాపంతో పురుగులమందు తాగగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ సంఘటన స్థానికంగా విషాదం నింపింది. జన్మనిచ్చిన తల్లిదండ్రులే భూమి ఇవ్వడంలో వివాదంగా వ్యవహరించడంతో తన భర్త మనోవేదనకు గురై క్రిమిసంహారక మందు తాగాడని మృతుని భార్య మానస ఆరోపించింది. ఎల్లారెడ్డిపేటకు కేంద్రానికి చెందిన బింగి సురేశ్(35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో రెండు ఎకరాల భూమిని తన పేరిట చేయాలని కోరాడు. తల్లిదండ్రులు నిరాకరించడంతో ఆవేదనకు లోనైన సురేశ్ కిష్టంపల్లి శివారులో గత శుక్రవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. సురేశ్ తండ్రి లచ్చయ్యకు ముగ్గురు కొడుకులు కాగా.. రెండో కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. తన భర్త మృతితో తాము రోడ్డున పడ్డామని భార్య మానస విలపించింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ఆల్ ఇండియా సెమ్స్ ఒలింపియాడ్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన అనంతరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా సెమ్స్ ఒలింపియాడ్ లెవెల్–2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా లెవెల్–1 పరీక్షలో అర్హత సాధించిన 130 మంది విద్యార్థులు హాజరయ్యారు. అంతకుముందు పరీక్షా కేంద్రాన్ని మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి పరిశీలించారు. దేశవ్యాప్తంగా సెమ్స్ ఒలింపియాడ్ పరీక్ష ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతోందన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులందరూ ఇలాంటి పరీక్షలకు హాజరై, పోటీ ప్రపంచంలో వస్తున్న అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఏవో సుభాష్‌కుమార్, సిలివేరి మహేందర్, భూపతి, శాంతి, శిరీష, జహారా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించండి

జ్యోతినగర్(రామగుండం): రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని, నిరుపేదల ఇళ్ల కోసం కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ భూమిలో జెండాలను పాతారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని చెప్పి, పదేళ్లవుతున్నా ఇవ్వలేదన్నారు. కబ్జాదారుల నుంచి భూమిని రక్షించేందుకు రెవెన్యూ, పోలీసు కార్యక్రమంలో సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి, జిల్లా కమిటీ సభ్యుడు నాయకులు పాల్గొన్నారు.